# Eenadu

## త్వరలో జడ్జిల నియామక విధాన ప్రక్రియ సిద్ధం

**దిల్లీ:** సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకంపై ప్రభుత్వంతో గల భేదాభిప్రాయాలు చాలావరకు పరిష్కారమయ్యాయని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) టి.ఎస్.ఠాకూర్ తెలిపారు. ఆయన గతవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయిన నేపథ్యంలో ఈ ప్రకటన చేయటం గమనార్హం. నేషనల్ బ్రాడ్‌కాస్టర్స్ అసోసియేషన్ బుధవారం నిర్వహించిన జస్టిస్ జె.ఎస్.వర్మ రెండో స్మారకోపన్యాస కార్యక్రమంలో ఠాకూర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా విలేఖర్లు ఆయనను అత్యున్నత న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తుల నియామక ప్రక్రియపై ప్రశ్నించారు. దీనికి ఆయన స్పందిస్తూ.. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విధాన ప్రక్రియ (ఎంఓపీ) త్వరలో సిద్ధం కావొచ్చని అభిప్రాయపడ్డారు. "చాలా విషయాలు పరిష్కారమయ్యాయి. కొన్ని అంశాలపై చర్చించాల్సి ఉంది. రెండు, మూడు వారాల్లో పరిష్కారం కావొచ్చని భావిస్తున్నా. ప్రయత్నాలు కొనసాగుతున్నాయి" అని ఆయన వివరించారు. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టాన్ని రద్దుచేస్తూ. . కొలీజియం వ్యవస్థను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో విధాన ప్రక్రియ అంశం ముందుకొచ్చింది. ప్రభుత్వం కూడా ఇటీవల కొన్ని కొలీజియం డిమాండ్లకు సమ్మతించింది. వచ్చే వారంలో సుమారు 18 మంది కొత్త న్యాయమూర్తులు నియమితులయ్యే సూచనలు కనబడుతున్నాయి. కొత్త న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన దస్త్రాలకు అత్యున్నత స్థాయిలో ఆమోదం లభించిందని, ఇవి ఒకట్రెండు రోజుల్లో రాష్ట్రపతి భవన్‌కు చేరుకోవచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి. కొత్త నియామకాల్లో చాలావరకు మద్రాస్ హైకోర్టుకు సంబంధించినవి కాగా.. కొన్ని రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ హైకోర్టులకు చెందినవీ ఉన్నాయి.